

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

వార్త


## పబ్లిక్ హెల్త్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు పబ్లిక్ హెల్త్ సిబ్బందితో వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో శానిటరీ మేస్త్రీలు, సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సూపర్వైజర్లు వారివారికి సంబంధించిన ప్రాంతాల నందు ఉన్న కమర్షియల్ కు సంబంధించి ఇప్పటి వరకు గుర్తించని ట్రేడ్ లైసెన్సులు గుర్తించి వారి చేత డబ్బులు జమ చేయించి వాటిని ఆన్లైన్లో పొందుపరచవలసిందిగా ఆదేశించారు. వారి పరిధిలోని ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన వివరములను ఫార్మేట్ రూపంలో పొందుపరిచి వలసినదిగా ఆదేశించారు. డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేయవలసిందిగా ఆదేశించారు. మున్సిపల్ సర్వీసెస్ నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలని, ట్రేడ్ లైసెన్సులు చెల్లించని బకాయి దారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి వారు 13వ తేదీన జరగబోవు నేషనల్ లోక్ అదాలత్ కు హాజరయ్యేలాగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈనెల 17వ తారీఖు నుంచి అక్టోబర్ 2 వరకు ప్రారంభమవుతున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించవలసిన కార్యక్రమాలను కమిషనర్ వివరించారు. డ్రైన్ కాలువలలో తొలగించిన మట్టిని 24 గంటలలోపు ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఆరోగ్యశాఖ అధికారి కనకాద్రి, వెటర్నరీ డాక్టరు మదన్మోహన్, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ జిజియా బాయి, టీపిఆర్ఓ వాసు బాబు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.



## జడ్ పీ సీఈఓ, డీపీఓలను కలిసిన నూతన ఎంపీడీవోలు





**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** జిల్లా పరిషత్ యాజమాన్య సంస్థలో పరిపాలనాధికారికారులుగా డిప్యూటీ ఎంపీడీవోలుగా పని చేస్తూ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన అధికారులు జిల్లా పరిషత్ సీఈవో మోహన్ రావు, జిల్లా పంచాయతీ అధికారి లక్కిరెడ్డి శ్రీధర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవోలుగా పదోన్నతి పొంది నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు కేటాయించబడ్డ సాయి ప్రసాద్ నారాయణరెడ్డి తదితరులు బుధవారం జడ్పీ సీఈఓ, డిపిఓలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారి కోసం ప్రత్యేక ఎమర్జెన్సీ సెల్ ఏర్పాటు

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని యుద్ధ ప్రాతిపదికన సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక విమానాల ద్వారా రాష్ట్రానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందుకుగాను అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ప్రత్యేక ఎమర్జెన్సీ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా వాసులు ఎవరైనా నేపాల్‌లో ఉంటే వారి వివరాలను ఈ క్రింద పేర్కొన్న క్యూ ఆర్ కోడ్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకుంటే సహాయ సహకారాలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలికిన బీద

**నెల్లూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త-** వైద్యం సూపర్‌సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ బహిరంగ సభకు అనంతపురం పట్టణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హెలి ప్యాడ్ వద్ద స్వాగతం పలికారు.



## తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు



**మర్రిపాడు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** మెట్టప్రాంతమైన మర్రిపాడు మండలంలో ప్రత్యేక పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ తిండి, ఉపాది కొరతే కాదు చివరకు ఇక్కడ గత కొన్ని రోజులుగా తాగునీటికి కష్టాలు తప్పడం లేదు. ఏళకళ తరబడి ఫ్లోరైడ్ సమస్యతో మండల పరిధిలోని అనేక గ్రామాలు సతమతమవుతున్నాయి. ఈసమస్యను పరిష్కరించాలని 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టి ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలకు శుద్దిజలం అందించాలని కంకణం కట్టుకుంది. సుమారు 90శాతం పనులు పూర్తిచేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆపథకానికి వైఎస్ఆర్ సుజల స్రవంతిగా పేరు మార్చింది. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల ప్రజలకు దాహార్తిని తీర్చుడానికి 4/- రూపాయలకే లీటరు నీరు అందించేందుకు అప్పట్లో మర్రిపాడు మండల కేంద్రంలో మదర్‌ప్లాంట్ నిర్మించి బోర్లు ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి పంచాయతీలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ఆ నీటిని ప్రజలకు అందించేలా ప్రణాళిక రూపొందించారు. కొంతకాలంగా పల్లెలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సజావుగా సాగిన గత 20రోజుల నుండి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఆగిపోయి తాగునీటికి కష్టాలు పడుతున్నామని ఏపిలిగుంట, బూదవాడ, వెంకటాపురం, కృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలుఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కండలేరులో 43.180 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం (రాపూరు), సెప్టంబరు 10, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో బుదవారం ఉదయం నాటికి జలాశయంలో 40 టీయంసీల నిటీ నిల్వ దాటి ప్రస్తుతం జలాశయంలో 43.180 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జలాశయంలోకి 9000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 985 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 40 క్యూసెక్కులు, హైలెవల్ స్లూయిస్ ద్వారా 100 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1125 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రజలు లేకుండానే ప్రజాభిప్రాయమా..?

## అత్యంత గోప్యంగా ప్రజాభిప్రాయ సేకరణ పక్రియ



**సైదాపురం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో మైనింగ్ అనుమతుల కొరకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ సభ ఇటీవల స్థానిక ప్రజలు లేకుండానే అత్యంత గోప్యంగా నిర్వహిస్తూ పేరుకే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి సాక్షాత్తు అధికారుల సమక్షంలోనే గంటల్లోనే ముగించేస్తున్నారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ ఒక డ్రామా సెట్టింగ్ సినిమా షూటింగ్‌ల అయిపోయింది. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూష ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమక్షంలో మైనింగ్ అనుమతులపై బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ నాగ సంతోషి అనూష మాట్లాడుతూ ఊటుకూరు గ్రామంలో ఉన్న సర్వే నెంబరు 359/1లో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 24.476 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహించేందుకు వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ వారు ప్రభుత్వ అనుమతులు కొరకు దరఖాస్తు చేయగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేయడం జరిగిందని ప్రజల అభిప్రాయాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా మైనింగ్ అనుమతులు ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. అయితే స్థానిక ప్రజల అభిప్రాయాల కొరకు ఏర్పాటు చేసిన ఈ ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ ప్రజలు రాకుండానే మైనింగ్ యాజమాన్యం, అధికారులు సభను ఏర్పాటు చేయడం పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు కనీసం పది మంది కూడా లేకుండా పక్క గ్రామాలు అయిన చెర్లోపల్లి, చాగణం, అనంతమడుగు గ్రామాల నుండి అద్దె మనుషులను తీసుకువచ్చి స్థానికంగా చిత్రీకరించి తూతూ మంత్రంగా అధికారుల సాక్షిగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కనీసం స్థానిక జర్నలిస్టులకు కూడా సమాచారం అందించకుండా ఈ సభ నిర్వహించడం పట్ల అనేక అనుమానాలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ ఓ నాటకం అనిపించేలా అద్దె మనుషులను తీసుకువచ్చి హడావుడి పెట్టి గంటలోనే ముగించేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సైదాపురం మండలంలో ఉన్న మైనింగ్ క్వారీలు ఫొడర్ ఫ్యాక్టరీల వల్ల దుమ్ము, దూళి ప్రభావంతో జనజీవనం సైతం ప్రాణాంతకంగా మారిపోయినప్పటికి అధికారుల నిర్లక్ష్యం వల్ల తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణలు నిర్వహించడం వల్ల అనేక మంది అనారోగ్యాల పాలు అయిన సంఘటనలు కూడా నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఊటుకూరు స్థానిక ప్రజలు కొంత మంది సభలో మాట్లాడుతూ మైనింగ్ లీజు వరకు దరఖాస్తు చేసుకున్న యాజమాన్యం గ్రామ ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే భయట ప్రాంతాల వారిని తీసుకువచ్చి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని, ఈ ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉన్నందువలన మైనింగ్ అనుమతులు ఇవ్వవద్దని స్థానిక ప్రజలు అధికారులను కోరారు. ప్రజలు లేని ప్రజాభిప్రాయ సేకరణ వలన భవిష్యత్తులో స్థానిక ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



### ఈ ప్రాంతాన్ని మైనింగ్‌కు ఇవ్వకుండా సాగుకు అనుమతులు ఇవ్వండి :

ఈ ప్రాంతాన్ని మైనింగ్ లీజుకు ఇవ్వకుండా పంట సాగు చేసుకునేందుకు అధికారులు అనుమతులు ఇవ్వాలని ఊటుకూరు గ్రామానికి చెందిన కోటయ్య, సురేష్ అనే వ్యక్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం గతంలో ఉన్న మైనింగ్ లీజు గడువు ముగిసిన తరువాత గత మూడు సంవత్సరాలుగా మేము పంట సాగు చేసుకుని జీవిస్తున్నామని, అందువలన ఈ ప్రాంతాన్ని మైనింగ్ లీజు ఇవ్వకుండా పంట సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని వారు కోరారు. ముఖ్యంగా మా గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణపై ఎటువంటి దండోరా, సమాచారం ఇవ్వలేదని వారు తెలిపారు. ఈ భూముల విషయమై పలు పోరాటాలు కూడా జరిగాయని, దళితులమైన తమపై మైనింగ్ యాజమాన్యం అక్రమ కేసులు కూడా పెట్టించడం జరిగిందని వారు అధికారులకు వివరించారు.

# ఆత్మకూరు ఎక్సైజ్ సిఐ వాహనం - మోటాకు బైకు డీ

## ఒకరు మృతి.ఇద్దరికి గాయాలు, సిఐ రమణమ్మకు గాయాలు











**సంగం సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎక్సైజ్ సిఐ వాహనం, మోటార్ బైకు ఢీ కొనగా ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి అలాగే ఎక్సైజ్ సి.ఐ రమణమ్మకు గాయాలు అయ్యాయి.పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. ఆత్మకూరు వైపు నుండి నెల్లూరుకి వెళుతున్న ఎక్సైజ్ సిఐ వాహనం , బుచ్చి నుండి నుండి దువ్వూరు వైపు వస్తున్న మోటార్ బైకు ప్రమాదవశాత్తు ఢీకొనగా మోటార్‌బైకులో ఉన్న జైరామయ్య అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే ఎక్సైజ్ సిఐ రమణమ్మకు కూడా తలకు తీవ్రగాయాలు కాగా ఆమెను బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు. ఈ సంఘటనలో మరో ఇద్దరికి కూడా గాయాలు అయ్యాయి వారిని కూడా బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## గ్రంధాలయ అభివృద్దికి కమీటి ఏర్పాటు



**మనుబోలు సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** మనుబోలు మండల గ్రంధాలయ అభివృద్ధి కమీటి ఏర్పాటు చేస్తు న్నట్లు లైబ్రరీయన్ వి.అరుణకుమార్ తెలిపారు. ఇందు లో ఎంపిడిఒ,తహసిల్దారు ,ఎంఇఒలు ప్రధానో పాధ్యా యులు కమీటి మెంబర్లుగా ఉంటారన్నారు. ఈ సంద ర్భంగా ఎంపిడిఒ జలజాక్షికి వినతి పత్రం అంద జేశా రు. బుధవారం వారందర్ని కలిసి గ్రంధాలయ అభి వృద్దికి తీసుకోవాల్సి న చర్యల గురించి చర్చించారు. శిధిలావ్థకు చేరుకున్న గ్రంధాలయ భవనమును తొలగించి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈవిషయం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళతామని ఎంపిడిఒ జలజాక్షి, ఎంఇఒ ఓబులు, గరుడయ్య తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహార చతుర్థీ వేడుకలు



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలసి ఉన్న వరసిద్ధి వినాయక స్వామికి బుధవారం సంకట హర చతుర్థీ పర్వదినాన్ని పురస్క రించు కుని ఆలయ ప్రధాన అర్చకులు నాగరా జాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్దంగా భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రవ ంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో బిచ్చగాడు మృతి



**దగదర్తి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** దగదర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామ పరిధిలో గల జాతీయ రహదారి 16పై నెల్లూరు నుంచి కావలికి వెళ్ళు రోడ్డు పక్కన ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న మామిడి తోట వద్ద సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని బిక్షగాడు వడదెబ్బ వల్ల మరణించగా, సదరు విషయంను దగదర్తి పోలీసు వారు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతి చెందిన బిక్షగాడిని పోలీ సులు పరిశీలించారు. వివరాలను విచారణ చేసి సేకరిస్తామని తెలియ జేశారు.

## కేంద్ర మంత్రిని కలిసిన అంకినపల్లి



**వింజమూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శకావత్ ను బుధవారం ఢిల్లీలో మాజీ ఎఫ్సీఐ డైరక్టర్ సీనియర్ నాయకులు అంకినపల్లి ఓబుల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని నీలగిరి పర్వతంపై వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ది కొరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పంపిన ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో ఆలయ అభివృద్ధి కొరకు సుమారు 48 కోట్ల రూపాయలతో డీపీఆర్‌కు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఎల్‌సి కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

## పందిటి సుబ్బయ్య లోను తీసుకొన్నారని అబద్దపు ప్రచారం

**- విలేకరుల సమావేశంలో అరుంధతివాడ ప్రజలు**



**నెల్లూరు సిటీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు చింతోపు అరుంధతివా డఎస్.సి. మాదిగ కులానికి చెందిన నిరుపేదలమని విలేకరుల సమావేశంలో అరుంధతివాడ ప్రజలు తెలిపారు. అయితే బ్యాంక్ ఆఫ్ బరోడా టౌన్ మెయిన్ బ్రాంచ్‌లో మెప్మా ద్వారా మాకు 2023లో లోను మంజూరు చేశారని, అప్పుడు మేము సభ్యులందరం కలిసి అందరూ ఆయన లోన్ ద్వారా వచ్చిన నగదను సమానంగా తీసుకోవటం జరిగిందన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తమ ఊరులో రాజకీయంగా రెండు గ్రూపులు ఉన్నందువల్ల పందిటి పోలయ్య అను వ్యక్తి ఆ గ్రూపు సభ్యులతో ఒకరిని రెచ్చగొట్టి ఆమెచేత పందిటి సుబ్బయ్య లోను తీసుకొన్నారని అబద్దపు ప్రచారం చేయించారన్నారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని, పందిటి సుబ్బయ్యకు మాకు ఏలాంటి సంబంధం లేదని, కేవలం రాజకీయ, వ్యక్తిగత కక్షతో అతని మీద బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు.అయితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ బ్రాంచ్లో శ్రీనివాసులురెడ్డి అనే ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.సి. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఎస్.సిల పేర్లు పెట్టి పందిటి పోలయ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి ఇద్దరు కలిసి బినామీలుగా ఎస్.సి. మహిళలను సభ్యులుగా పెట్టి ఈ డబ్బులు మొత్తం వీళ్ళే తినేశారని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్ళడం జరిగింద న్నారు. దీంతో కలెక్టర్ అతని మీద ఎంక్వైరీ చేయించి కేసు కట్టించామని కక్షతో ఆ పోలయ్యతో కలిసి శ్రీనివాసులురెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అందువల్ల పూర్తివిచారణ చేయించిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఇదే విషయముపై తమరి దృష్టికి ఇదివరకే తీసుకొని రావడం జరిగిందని అరుందతివాడకు చెందిన వారు తెలిపారు.

## టీబీ నిర్మూలనకు విశేషంగా కృషి చేయండి



**నెల్లూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త -వైద్యం :** టీబీ నిర్మూలనకు వైద్యులు విశేషంగా కృషి చేసి, లక్ష్య సాధనకు చేరుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ నితీష్ రామ్ అన్నారు. బుధవారం నెల్లూరులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి.సుజాత టీబీ నివారణాధికారి ఎస్‌కే ఖాదర్ వలి, వరల్డ్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ నితీష్ రామ్ వచువల్‌గా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌తో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నితీష్ రామ్ మాట్లాడుతూ ఇంటెన్సీఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వ్యాధిగ్రస్తుల మొత్తాన్ని స్క్రీన్ చేసి నిశ్చయపోటల్లో ఎన్‌రోల్‌మెంట్ చేయాలని సూచించారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి కపం పరీక్షలు చేయాలని కోరారు. స్వల్ప లక్షణాలున్న వారికి కూడా ఛాతీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం నెల్లూరు రూరల్ టీబీ యూనిట్ పరిధిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి టీబీ పేషెంట్లకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ టీబీ హెచ్ఐవీ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, వేణు, శోభారాణి, అర్బన్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట ఎరువులపై రైతులు దృష్టి సారించాలి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** నేల ఆరోగ్యాన్ని మరింత సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర, పీఎండీ ఎస్ కిట్స్ వేసేలా రైతులు తగు చొరవ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ణి టి. రజని అన్నారు. కోవూరు మం డలం వేగూరు గ్రామంలో బుధవారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో రైతులకు అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియా వాడుకోవాలని అధిక యూరియా వాడడం వలన భూమి ఆరోగ్యం దెబ్బతిని నీటి కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా వేగూరు పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమరావతి, సీనియర్ టీడీపీ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు శిరీష, మౌనిక, రైతులు ఉన్నారు.

## తోపుగుంట వద్ద చిరుతపులి సంచారం

**కలువాయి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** మండలంలోని తోపు గుంట గ్రామం సమీపంలో మంగళవారం రాత్రి చిరుతపులి సంచరిస్తుండగా అదే మార్గాన వెళుతున్న ఒ బ్యాంకు ఉద్యోగికి తారస పడినట్లు సమాచారం. పులిని చూసి ఆ ఉద్యోగి వెనుకకు తిరిగి పరుగులు తీయడం మండలంలో భయాంధోళనకు గురి చేసింది. ఇటీవల చిరుపులి దక్షణ కాలువలో చింతలాత్మకూరు సమీపంలో కొట్టుకొచ్చిన ఘటన మరువుక ముందే మరో చిరుత సంచారంతో మండల వాసులు భయాందోళనకు గురౌతున్నారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా తోపు గుంట ప్రాంతంలో చిరుత సంచారం ఆ ప్రాంత వాసులు వారి దృష్టికి తీసుకొని వెళ్లినట్లు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం కట్టుబట్టలతో వీధినపడ్డ వృద్ధురాలు



**విడవలూరు,సెప్టెంబర్10ప్రభాతవార్త:** మండలంలోని రామచంద్రపురం పంచాయతీ వెంకటనారాయణపురం గ్రామానికి చెందిన తులసింఘని రామమ్మ నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం బుధ వారం జరిగింది. కూలి పనులు కూడా చేసుకోలేని వృధా వికలాంగులకురాల కు ఇలా జరగడం ఎంతో బాధాకరమని గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామస్తులు వాపోయారు.వృద్దురాలను ప్రభుత్వం, అధికా రులు, నాయకులు ఆదుకోవాలని కోరుకుంటున్నారు. సంఘ టన స్థలానికి వీఆర్వో కుమార్ చేరుకుని పరిశీల న చేశారు. పూర్తి నివేదిక సేకరించి స్థానిక తహసిల్దార్‌కు తెలియజేయడం జరుగుతుందన్నారు.

## శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో బాలవికాస్ సంబరాలు



**కావలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కావలి పాత ఊరు లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నందు బుధవారం సత్యసాయి సేవా సమితి బాలవికాస్ గురువుల ఆధ్వర్యంలో బాలవికాస్ సంబరాల కార్యక్రమం జరిగినది. ఈ సందర్బంగా సత్యసాయి సమితి కన్వీనర్ కొత్తూరు సత్యనారాయణ మాట్లాడారు ఈ కార్యక్రమం నిర్వహించుటకు సహకరించిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బాల వికాస్ సంబరాల కార్యక్రమంలో దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు . ఇంతమంది విద్యార్థులు పాల్గొనేందుకు సహకరించిన కళాశాల యాజమాన్యం కు సత్యసాయి సమితి సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైసిపి అన్నదాత పోరు విజయవంతం

**- రైతులకు వైసీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన నేతలు**



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, యువజన విభాగ అధ్యక్షుడు నల్లపురెడ్డి రజత్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాకాణి మాట్లాడుతూ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా అన్నదాత పోరు నిర్వహించామని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, ముఖ్యంగా నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట, కందుకూరు రెవెన్యూ డివిజన్లలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనడం ద్వారా ఈ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించిందన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కే ప్రయత్నం చేసిందని ఆయన ఆరోపించారు. అన్నదాత పోరు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు హౌస్ అరెస్టులు చేయడం, అనవసరమైన షరతులు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. 15 మందికి మించి పాల్గొనరాదు, మీడియా ముందు ప్రభుత్వంపై విమర్శలు చేయరాదంటూ పెట్టిన షరతులు హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. యూరియా కొరతపై కూడా కాకాణి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "రైతులకు కావాల్సిన యూరియాను 50 ప్రైవేట్ వారికి ఎందుకు అప్పగించారు? చంద్రబాబు తెచ్చిన లక్షల టన్నుల యూరియా ఎక్కడ పోయింది? రైతులు క్యూలలో నిలబడి బాధపడే పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని మండిపడ్డ ఆయన, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడం అర్థరహితమని అన్నారు. అన్నదాత పోరు విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన నియోజకవర్గ ఇన్చార్జీలు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. వేలాది మంది రైతులు పాల్గొనడం ద్వారా కూటమి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలు ఎప్పటికీ సాగవని స్పష్టమైన హెచ్చరిక వెళ్లిందని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడేది ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ప్రజలు ఇబ్బందులు పడకుండా మా నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎప్పటికీ అండగా నిలుస్తాం" అని కాకాణి స్పష్టం చేశారు.

## రైతులకు శిక్షణా కార్యక్రమం




**పొదలకూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో మహమ్మదపురం గ్రామములో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించుట జరిగింది. ఐ పి యం విధానంలో వరి పంట సాగు విధానం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల సాగు జలాలు,వాతావరణం కాలుష్యం సంభవిస్తున్నవి అని రైతులకు తెలియజేసారు. అదేవిదంగా వరి పంటలో యూరియా, దుక్కి మందులు వాడకం మరియు సిఫార్సు చేసిన మోతాదులను రైతులకు తెలియజేసారు. యూరియా 110 కేజీలను మోతాదు వరి పంట సాగుకు సరిపోతుంది, అంతకు మించి అధిక మోతాదులో యూరియా వాడటం వలన చీడపీడలు సంభవించి తద్వారా పురుగు మందులు,తెగుళ్ల మందులను అధికంగా పిచికారీ చైయట వలన సాగు ఖర్చులు ఎక్కువ అవ్వుతున్నవి .రైతులు సాగు ఖర్చులు తగ్గించాలి అంటే ముఖ్యముగా యూరియా వాడకం ప్రభుత్వం సిపారసు చేసిన మోతాదు లోనే వాడాలి అని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివ నాయక్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డి ఏ పి వాడుకొనివాలి అని రైతులకు తెలియజేసారు. అదేవిదంగా పీఎం డి యస్ బహు పంటల కిట్లు (నవ ధాన్యాలు) పంట కోత అనంతరం వేసుకోవడం వలన పచ్చిరొట్ట పంటగా వాడుకోవడం వలన పంటకు కావలసిన మోతాదులో సేంద్రీయ కార్బనం, నత్రజని అందుతుంది అని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజా మోహన్ రెడ్డి, వీఏఏలు సురేంద్ర,ప్రణీత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అడపాల సుధాకర్ రెడ్డి, యేదెం శివకుమార్ రెడ్డి, నాయకులు, రైతులు సుధాకర్ రెడ్డి,శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిచర్లలో దారుణ హత్య

**- ఒంటరిగా జీవిస్తున్న వ్యక్తిని దారుణంగా హతమార్చిన దుండగులు.- మంచంపైనే కడ తీర్చిన దుండగులు.- హంతకుల కోసం రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు కందుకూరు డిఎస్పి బాలసుబ్రహ్మణ్యం**




**లింగసముద్రం ,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** మంచం మీద పడుకొని నిద్రపోతున్న వ్యక్తిని అత్యంత దారుణంగా కొట్టి చంపిన సంఘటన మొగిలిచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో మంగళవారం రాత్రి ఆవుల శ్రీను(48) అనే వ్యక్తి అన్నం తిన్న తర్వాత ఆయన ఇంట్లో బయట మంచం మీద పడుకొని రోజుకు లాగే నిద్రిస్తున్నాడు.నిద్రపోతున్న సమయంలోనే దుండగులు ఆయన ను కొట్టి చంపారు.నాలుగు సంవత్సరాల క్రితం భార్య చనిపోయింది,ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు కావడంతో శ్రీను ఒంటరిగా జీవిస్తున్నాడని స్థానికులు తెలిపారు.మంగళవారం రాత్రి 10 గంటలకు పడుకున్న శీను తెల్లారేసరికి మంచంపై పడుకున్న స్థితిలోనే దారుణ హత్యకు గురై ఉండడాన్ని బంధువులు గుర్తించారు.శ్రీను తలపై బలమైన గాయాలు, రక్తపు మరకలు ఉన్నాయి. దీంట్లో వెంటనే బంధువులు లింగ సముద్రం ఎస్సై నారాయణకు సమాచారాన్ని అందించారు.ఘటన స్థలాన్ని కందుకూరు డిఎస్పి సుబ్రహ్మ ణ్యం,గుడ్లూరు సీఐ మంగారావు పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ కర్రతో కానీ లేక బలమైన ఆయుధంతో కానీ కొట్టి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. హంతకులను గుర్తిం చడం కోసం లింగసముద్రం,వలేటివారిపాలెం ఎస్సైల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.హతుడికి ఎలాంటి ఆస్తి తగాదాలు లేవని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాలలో పోలీస్ విచారణ సాగుతున్నది. నెల్లూరు నుంచి క్లూస్ టీం,డాగ్స్ స్క్వాడ్ పిలిపించి పరిసరాలను పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

## బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు భూమి పూజ



**వింజమూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పది లక్షల రూపాయల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణం ప్రారంభిం చారు. బీసీ కాలనీలో ట్రాక్టర్ రాయుడు ఇంటి వద్ద నుండి రామాలయం వెనుక వైపు ఆదెమ్మ నివాసం వద్దకు సుమారు 260 మీటర్లు రోడ్డు ఏర్పాటు అవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ గూడా నర్సా రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు నిర్మాణం చేయాలన్న సంకల్పంతో కోట్లాది రూపాయల నిధులను ఇప్పటికే మంజూరు చేయించి అనేక ప్రాంతాలలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా వింజమూరు బీసీ కాలనీలో గత దశాబ్దాలుగా సీసీ రోడ్లు లేక ఆ ప్రాంత వాసులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని వర్షాకాలం వస్తే మోకాటి లోతు నీటిలో నడవాల్సి న పరిస్థితి ఉండేదని నేడు బీసీ రోడ్ల నిర్మాణంతో ఆ ప్రాంత వాసులకు సమస్య లేకుండా పోయిందని ఆయన తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యేతో సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ తిరుమలయ్య, ఇంజనీరింగ్ సహాయకులు మహిమరెడ్డి,తాళ్లూరి మాధవ, తాళ్లూరు రమణయ్య, గాలి శేషయ్య, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## లోక్ అదాలత్ పై అవగాహన పెంచుకోవాలి



**కావలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ప్రజలు, కక్షదారులు లోక్ అదాలత్ పై అవగాహన పెంచుకొని సత్వర న్యాయం పొందాలని సామాజికవేత్త మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం చలంచర్ల పంచాయతీ పెద్దవరం గ్రామంలో బుధవారం లోక్ అదాలత్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ సందర్బంగా ఎం.మాలకొండ రెడ్డి మాట్లాడారు కావలి సబ్ కోర్ట్ ఆవరణలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతున్న సందర్భంగా గ్రామ ప్రజలు సద్వినియోగ పరుచుకో వాలని కోరారు,పెండింగ్ కేసులు, రాజీ చేసుకోదగిన కేసులను ఈ మెగా లోక్ అదాలత్ లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపినారు. కావలి న్యాయస్థానంలో ఉన్న న్యాయమూర్తుల ఆధ్వర్యంలో ఈ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ తో కక్షిదారులు రాజీ చేసుకోవడం ద్వారా కోర్టు ఖర్చులు కూడా తిరిగి ఇవ్వబడతాయని తెలిపినారు. గ్రామాల్లో పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి వివాదాలు లేకుండా ధర్మబద్ధంగా జీవించడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు.ఈ మెగా లోక్ అదాలత్ తో కావలి కోర్టు పరిధిలో ఉన్న కొండాపురం,జలదంకి,కలిగిరి, కావలి, కావలి రూరల్ మరియు బోగోలు మండలాలకు సంబంధించిన కక్షిదారులు ఈ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో దేగ సుధాకర్, విజయలక్ష్మి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఫుల్ ,పోలీస్ నిల్



**కలిగిరి, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** నిత్యం రద్దీగా ఉండే కలిగిరి బస్టాండు సెంటర్లో పోలీసులే కరువౌతు న్నారు. బస్తాడు పక్కనే పోలీస్ స్టేషన్ ఉన్నాపోలీసులు బస్టాండు వైపు కన్నెత్తైనా చూడరు. పైనుండి ప్లైజర్ వచ్చినా ఏదో మూనాళ్లపాటు అలా ట్రాపికులో ఉండి అలా వెళ్లి పోతుంటారు. దీనితో కలిగిరి బస్టాండు సెంటర్లో ఉదయం 5గంటలనుండే పదులసంఖ్యలో వాహనాలు రద్దీగా ఉంటాయి. ఉదయం5గంటలకే పార్సిల్ వాహనాలు బస్టాండుకు అతి సమీపంలో నిలుపుదల చేసి సరుకులు అన్లోడు గంటలకొలదీ చేస్తుం టారు. ఇవి చాలవన్నట్లు కూరగాయలకు వచ్చేవాహనాలు రోడ్లపైనే నిలుపుదలచేసి కూరగాయలు కొను గోలు చేస్తుంటారు. ఆటోలుసైతం రోడ్లకు ఇరువైపులా అడ్డదిడంగా ఉంటాయి. ఈక్రమంలో అటువైపు వెళ్లే వాహనాలకు దారి ఉండదుకదా పాదచారులుసైతం ట్రాపిక్‌వల్ల ఇబ్బందులు పడుతుంటారు. అంతేగాక ఉదయం 8గంటలనుండి పలుస్కూల్స్ శాహనాలు తిరుగుతుంటాయని, విద్యా ర్థులుసైతం స్కూళ్లకు వెళ్లే సమయంలో ట్రాపిక్‌వల్ల ప్రమాదాలు జరగవచ్చని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఈ విషయాలను ప్రజలు అనేకసార్లు పోలీసులదృష్టికి తెచ్చినా పటించు కోవడం లేవనే ఆరోపణలు భలంగా వినిపిస్తున్నారు. పలువుర విజ్ఞప్తుల మేరకు ఇటీవల కొద్దిరోజులు పోలీసులు ట్రాపిక్‌డ్యూటీ చేసినా ఎందుకో మరలా మరిచిపోయారు. ఇప్పటికైనా స్పందిచి ఉదయం 6గంటలనుండి 9.30లవరకు ట్రాపిక్‌ను కంట్రోల్ చేయాలని కూరగాయల అంగళ్లవద్ద వాహనాలు అడ్డులేకుండా చేయా లని, అదేవిదంగా పార్సిల్ వాహనాల వల్ల ట్రాపిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని కలిగిరి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డితో భేటి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** నెల్లూరులో దైకాస్ రోడ్డులో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నల్లపరెడ్డి రజిత్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీ విషయాలను గురించి వారు చర్చించుకున్నారు.

## బస్సులకోసం ప్రజల నిరీక్షణ



**కలిగిరి, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** ఒకపక్క ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.ప్రయాణీకులు,విద్యార్థులు, ఉద్యోగస్తులు ఇలా అనేకమంది బస్సుల కోసం బస్టాండుకు వచ్చినా బస్సులు ఎంతకీ రాకపోవడంతో గంటలకొలదీ బస్టాండుల్లో వేచి చూడాల్సిన పరిస్తితి. ఒకవేళ గంటకో అరగంటకో ఓ బస్ వచ్చినా పుట్‌బోర్డువరకూ వేలాడుతున్న ప్రయాణీ కులు. దీనితో ప్రజలకు ప్రయాణంతిప్పలు తప్పలేదు. బుధవార అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి శ్రీశక్తి సభకు అనేక బస్సులు తరలి వెళ్లడంతో ప్రయాణీకులకు తిప్పలు తప్పలేదు . గంటలకొలదీ ప్రయాణీకులు బస్టాం డుల్లో వేచి ఉండాల్సిన పరిస్తితి ఏర్పడింది.

## ఆత్మకూరులో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్‌దాడులు



**ఆత్మకూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎరువుల కొరత సృష్టిస్తున్నారని ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని ఎరువుల దుకాణాలను నెల్లూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆ శాఖ ఎఐ కె.వేణుగోల్, సిఐ షేక్ సుభాని, వారి సిబ్బందితో ఈ తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. దుకాణాదారులను రైతులకు ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మకాలు చేపడితే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం తనిఖీలు చేపట్టిన షాపుల్లో ఎరువుల నిల్వలు, వాటిపర్యవేక్షణ రికార్డులు సవ్యంగానే ఉన్నాయన్నారు. ఈ తనిఖీల్లో అగ్రికల్చర్ అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష పీవో వెంకటసుబ్బయ్య సూచించారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఏఎంవో సుధీర్ బాబు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న కంప్యూటర్ నైపుణ్యం మరింత వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రతి ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ద్వారా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని కూడా విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలన్నారు.

## వైద్య సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ కొత్తూరు తూర్పు దళితవాడలో ఏర్పాటు చేసిన ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం కోవూరు మండల టీడీపీ అధ్యక్షుడు కొల్లా రెడ్డి సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఆరోగ్య కేంద్రం లో పిల్లలకు అందుతున్న సౌకర్యాలను, వైద్య పరీక్షలను పరిశీలించి వైద్యులతో, ఆశా వర్కర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఆరోగ్య సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు ఇటువంటి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌కే సుభాన్, శ్రీనివాసులు, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా అందజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కూడా చెత్త నుంచి సంపదగా తయారవుతున్న ఎరువులను రైతులకు అందజేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని సూచించారు.

## ఆటాపాటలతో కూడిన విద్యను అందించాలి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించినప్పుడే కేంద్రాలు మరింత అభివృద్ధిలోకి వస్తాయని, ప్రాజెక్టు సీడీపీవో శారద అన్నారు. కోవూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెల 10వ తేదీ లోగా చిన్నారుల యొక్క బరువు ఎత్తు తూచి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. పిల్లల సంఖ్యను మరింత పెంచేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు తగు చొరవ తీసుకోవాలన్నారు. కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గర్భవతులకు , బాలింతలకు క్రమం తప్పకుండా ఇంటికి వెళ్లి ఫేస్ యాప్‌లో నమోదు చేసి వారికి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

## ఐఎస్ఐ మార్కు కలిగిన గ్యాస్ స్టౌవ్ పరికరాలను వాడాలి




**కలువాయి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** ఐఎస్ఐ మార్కు కలిగిన గ్యాస్ స్టౌవ్ , రెగ్యులేటర్లను మాత్రమే వినియోగించాలని ఎల్‌పిజి గ్యాస్ ఏజన్సీ మేనేజర్లుఎస్‌కె షాహుల్,నరసింహలు తెలిపారు. స్థానిక జూనియర్ ,డిగ్రీ కళాశాలలో విద్యార్దులకు ఎల్‌పిజి గ్యాస్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు.గ్యాస్ సిలిండర్ ఇంటి వద్ద డెలివిరి అయ్యే సమయంలో సిలిండర్‌కి సీల్ ఉందా లేదా అని తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు.గ్యాస్ లీక్ అయినప్పుడు ఇంట్లో లైట్లు వేయడం, వెలిగించడం వంటి పనులు చేయకూడదని ప్రధానంగా గ్యాస్‌పై ఎక్స్ పైర్ తేది చేసుకొని వాడుకోవాలని,పలు సందర్భాలలో ప్రమాదాల నుండి బయట పడే అవకాశాల గురించి విద్యార్దులకు తెలియజేశారు.ఈకార్యక్రమంలో డిగ్రీ కాలేజి ప్రిన్సిఫల్ నరేంద్రకుమార్ ,జూనియర్ కాలేజి ప్రిన్సిఫల్స్, పి శ్రీనివాసులు , గ్యాస్ సిబ్బంది, విద్యార్దులు పాల్గొన్నారు.

## రెండు బైక్ లు ఢీ యువకుడు మృతి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరు సమీపంలోని రామన్నపాలెం గేట్ వద్ద జాతీయ రహదారి పై బుధవారం రెండు మోటార్ బైకులు ఢీ కొనగా అస్సాం రాష్ట్రానికి చెందిన అర్మాన్ నాయక్ అనే యువకుడు మృతి చెందాడు. వివరాలలోకి వెళితే కోవూరు వైపు నుంచి రామన్నపాలెం కు బైక్ పై వెళుతూ రోడ్డు దాటుతుండగా నార్తు రాజుపాలెం వైపునుంచి నెల్లూరు వైపు వెళుతున్న బైక్ ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిలో రామన్నపాలెం సచివాలయ మహిళా ఉద్యోగిని కరుణ ఉన్నారు. ఆమెను 108 ద్వారా వైద్యశాలకు తరలించారు. కోవూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రకాశంలో కందుకూరు ని కలపాలి మిరియం శ్రీనివాసులు



**కందుకూరు,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కందు కూరు నియోజకవర్గాన్ని వెంటనే ఒంగోలు జిల్లాలో కలపాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకట నలో తెలిపారు గతంలో కొత్త జిల్లాల ఏర్పాటు చేయడంలో కందుకూరు ను నెల్లూరు జిల్లాలో కలిపి నియోజకవర్గ ప్రజలను తీవ్ర ఇబ్బం దులకు గురి చేశారని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒంగోలు జిల్లాలో కలుపు తానని ఎన్నికల సందర్భ ంగా చంద్రబాబు నాయుడు ప్రకటించి ఉన్నందున అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్న నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఇదిగో చేస్తాం అదిగో చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారని అలాంటి ప్రకటన మానుకొని వెంటనే నియోజకవర్గాన్ని ఒంగోలు జిల్లాలో కలపాలని మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆధార్ కార్డులు కూడా ఇప్పటివరకు ప్రకాశం జిల్లాలోనే ఉన్నాయి కనుక వెంటనే కందుకూరి నియోజకవర్గాన్ని ఒంగోలులో కలిపి ప్రజల ఆకాంక్షను గౌరవించ వలసిందిగా తెలిపారు ఒక్క రూపాయి ఖర్చు లేని నియోజక వర్గాల మార్పు విషయంలో ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తుందోనని సూటిగా ప్రశ్నించారు.

## కుస్మంచి మహేంద్ర ప్రమాదవశాత్తు మృతి



**కావలి, సెప్టెంబర్10, ప్రభాతవార్త:** కావలి ముదవ వార్డు పాత ఊరికి చెందిన కుస్మంచి మహేంద్ర (40) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది మృతుడు మహేంద్ర భార్య శైలజ వివరాల మేరకు తన భర్త కుస్మంచి మహేంద్ర గత కొన్ని సంవత్సరాలుగా జలదంకి మండలం అన్నవరం గ్రామంలో క్షవర వృత్తి నిర్వహిస్తూ రోజు కావలి నుండి తన బైక్ పై అన్నవరం వెళ్లి తిరిగి వస్తుండేవాడని తెలియజేశారు. అదే క్రమంలో తేదీ 01.09.2025న రోజు లాగే అన్నవరం కు తన బైక్ పై వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జలదంకి తిమ్మసముద్రం మధ్యలో ఉన్న గోపన్నపాలెం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు బైక్ మీద నుండి క్రిందపడి తలకు బలమైన గాయాలయి కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని తెలియజేశారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించడం జరిగిందన్నారు అక్కడ నుండి మరల తిరుపతి ఎస్ వి ఐ ఎం ఎస్ హాస్పిటల్ నందు చేర్పడం జరిగిందని తెలియజేశారు అక్కడ చికిత్స పొందుతూ తేదీ 08, 09.2025న రాత్రి మృతి చెందడం జరిగిందని వైద్యుల దివీకరించడం జరిగిందన్నారు మాకు ఒక పాప ఒక బాబు ఉన్నారని మా కుటుంబానికి పెద్ద దిక్కు అయిన నా భర్త మహేంద్ర మృతిచెందనలతో మా కుటుంబం రోడ్డున పడిందని తెలియజేశారు. ఎటువంటి ఆధారాలు లేని మా కుటుంబానికి ప్రభుత్వం తగిన సాయం అందించాలని కోరారు జలదంకి పోలీస్ స్టేషన్ నందు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలియజేశారు.

## తల్లి ప్రేమ ఎంతో ఉన్నతమైనది



**కావలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** తల్లి ప్రేమ ఎంతో ఉన్నతమైనదని అమ్మ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నున్న మురళి తెలియజేశారు అమ్మ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో కావలి శివారు ప్రాంతమైన పెంకులు ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో బుధవారం వంగలరెడ్డి జయ లక్ష్మమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమార్తె సుజాత పేద గిరిజనులకు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడారు తన తల్లి జయలక్ష్మమ్మ మృతి చెందినప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆమె కోరిక మేరకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు నున్న మురళి మాట్లాడారు సుజాత తన తల్లి పేరు మీద ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలియజేశారు కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు మదన్, రమేష్ తదితర గిరిజనులు పాల్గొన్నారు

## మహిళ చేతిలో నగదు అపహరణ



**సీతారామపురం సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురం లోని కెనరాబ్యాంకులో సంగసానిపల్లికి చెందిన నీలి విజయమ్మ అనే మహిళ నగదు విత్ డ్రా చేసి బ్యాంకు బయటకు వచ్చి లెక్కించుకుంటుండగా గుర్తు తెలియని దుండగుడు చేతిలో నుండి డబ్బులు లాక్కొని బైకు మీద పరారయ్యాడు. అనంతరం స్దానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ మంత్రి ప్రసన్న తనయుడును కలిసిన వైకాపా నేత కొండూరు అనిల్ బాబు



**విడవలూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** వైఎస్ ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు నియో జకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులుగా నియమించిన సందర్భంగా మాజీ మంత్రి, వైకాపారాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, కోవూరు నియోజ కవర్గ యువజన విభాగ అధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్ కుమార్ రెడ్డి ని నెల్లూరు ఆయన నివాసంలో వైకాపా నాయకులు కొండూరు అనిల్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్న కృష్ణారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి, విడవలూరు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమణయ్య, బంగారయ్య, మోహన్, కొండూరు సాగర్ రెడ్డి, కుడితిపాలెం సర్పంచ్ సురేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బాణాసంచా పేలుడు ఘటనలో 12 మంది అరెస్ట్

**కావలి, సెప్టెంబర్10, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జనం సందర్భంగా ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో ఉదయగిరి మండలం, అప్ప సముద్రం గ్రామానికి చెందిన వేలమూరి భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు నడింపల్లి గ్రామ వినాయక విగ్రహ కమిటీ సభ్యులు ఇద్దరినీ, అప్పసముద్రం గ్రామ వినాయక విగ్రహ కమిటీ సభ్యులు పదిమందిని మొత్తం12 మందిని అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పీ పి. శ్రీధర్ మాట్లాడారు బాణాసంచా పేలుడు ఘటనలో తొమ్మిది మంది చిన్నారులకు గాయాలయ్యాయి అని తెలియజేశారు.ఈ ప్రమాదంపై ఉదయగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి కారణమైన వారిని అరెస్టు చేసి, నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం సమయంలో అప్పసముద్రం, నడింపల్లి గ్రామాల నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం రెండు ట్రాక్టర్లలో యువకులు బయలుదేరారన్నారు. అయితే అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించకుండా, టపాసులను వాహనాల్లో పెట్టుకుని కాల్చుకుంటూ వెళ్లారన్నారు. ఈ క్రమంలో నడింపల్లికి చెందిన విష్ణువర్ధన్ వరుసగా టపాసులు కాల్చగా వాటి నిప్పురవ్వలు అప్పసముద్రం ట్రాక్టర్‌పై పడ్డాయన్నారు. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న ఆకాశ సువ్వులు పేలిపోయాయి ఈ ప్రమాదంలో అప్పసముద్రం గ్రామానికి చెందిన తొమ్మిది మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారన్నారన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం వింజమూరు, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారన్నారు. ప్రస్తుతం వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందన్నారు. ఈ ప్రమాదంపై కావలి డీఎస్పీ శ్రీధర్ మార్గదర్శకత్వంలో ఉదయగిరి సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.ఇంద్రసేనారెడ్డి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ప్రమాదానికి కారణమైన మొత్తం 12 మందిని (ఎ1 నుండి ఎ12 వరకు) నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన రెండు ట్రాక్టర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు బైండోవర్ చర్యలు కూడా తీసుకున్నారన్నారు. పై కేసులో 9 మంది చిన్నపిల్లలు గాయాలు పడగా వారికి ప్రభుత్వం తరఫున ప్రతి పిల్లవాడికి 2 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు పండుగలు, ఉత్సవాలు లేదా శుభకార్యాల సందర్భాలలో టపాసులు వాడే ముందు సంబంధిత పోలీస్,ఫైర్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. నిర్లక్ష్యంగా టపాసులు కాల్చి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఆర్ ఎస్ ఆర్ లో కాలేజ్ న్యూస్ లెటర్స్ 2కె25 రిలీజ్



**బిట్రగుంట సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కాలేజ్ లో డిపార్ట్మెంట్ వైజ్ న్యూస్ లెటర్స్ 2కె25 రిలీజ్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ న్యూస్ లెటర్స్ నందు 2025 మే ఒకటో తేదీ నుండి 31 ఆగస్ట్ 2025 వరకు కళాశాలలో జరిగినటువంటి అన్ని కార్యక్రమాలు ఇందులో పొందుపరచడం జరిగిందని తెలిపారు. అలాగే ఫ్యాకల్టీ ప్రోత్సాహాలు అంటే ఈ సమయంలో ఏఏ ఫ్యాకల్టీ ఎన్ పీటీఎల్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, పేపర్ ప్రజెంటేషన్ లలో పార్టిసిపేట్ చేసి ఉత్తమ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలను పొందిన ఫ్యాకల్టీని ఈ న్యూస్ లెటర్స్ నందు ప్రచురించడం జరుగుతుందని, అలాగే విద్యార్థిని విద్యార్థులు వివిధ యూనివర్సిటీలలో, వివిధ కళాశాలలో ప్రశంసా పత్రాలను పొందిన వారిని గుర్తించి వారి వారి ప్రశంసా పత్రాలను ఈ న్యూస్ లెటర్స్ నందు పబ్లికేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇంకా కళాశాల మేనేజ్మెంట్ విద్యార్థిని విద్యార్థులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి అందించినటువంటి సౌకర్యాలు, ఇతర వివరాలు కూడా ఇందులో పబ్లికేషన్ చేయడం జరిగిందని అలాగే జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, యూనివర్సిటీ స్థాయిలో, జిల్లాస్థాయిలో కళాశాల తరఫున పొందినటువంటి అన్ని వివరాలను ఈ న్యూస్ లెటర్స్ నందు ప్రింట్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ న్యూస్ లెటర్స్ వల్ల విద్యార్థిని విద్యార్థులలో అలాగే అధ్యాపకులలో పోటీ తత్వం పెరిగి లేటెస్ట్ సాంకేతిక విద్యలో వచ్చినటువంటి మార్పులను, క్రొత్తదనాలను బాగా తెలుసుకునుటకు వీలుగా తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్వి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**వరికుంటపాడు, సెప్టంబర్10, ప్రభాతవార్త:** నా భూమికోసం భుక్తికోసం సాయుధ పోరాటంలో వీరోచితంగ పోరాడి గడిలపాలనను బద్దలు కొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ 40వర్ధంతి సందర్భంగ వరికుంటపాడు మండల రజకసంఘం అద్యక్షుడు మాచర్ల గురవయ్య ఆద్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమా లలువేసి ఘననివా ళులర్పించారు . ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు చాకలి ఐలమ్మ రజకులఆత్మగౌరవానికి ప్రతీక అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రజకుల ఆత్మగౌరవాన్ని గుర్తించి చాకలి ఐలమ్మకు ప్రభుత్వంద్వార నివాళులర్పించేల చర్యలు తీసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల గౌరవఅద్యక్షులు యాదగిరి హజరత్,చిలకపాటి సుబ్బారావు,ఉపాద్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు,ట్రెజరర్‌లు యాదగిరి ప్రసాద్,యాదగిరి మహేంద్రకృష్ణ,నాయకులు యాదగిరి తిరు పాలు,కాపునూరి వెంకటరమణయ్య,రావెళ్ల మహేష్,యాదగిరి కొండయ్య,యాదగిరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి గుడిలో చోరి



**జలదంకి, సెప్టంబర్10, ప్రభాతవార్త:** జలదంకి మండలం అన్నవరంగ్రామ బ్రహ్మంగారి గుడిలో చోరిజరి గింది. ఆలయ పూజారి కదనం మేరకు మంగళవారంరాత్రి పూజ అనంతరం రోజుమాదిరెతలుపులమూసి తన నివాసానికి వెళ్ళాడు.అయితే యదావిదిగ బుధవారం ఉదయం గుడి తీసి లోపలికివెళ్ళి చూడగ అమ్మవారి మెడలోవున్న మంగళ సూత్రం ఇతర నగులు కనిపించలేదని తెలిపాడు. దీంతో కంగారుపడి గ్రామ పెద్దలకు తెలియజేశానని వారి సూచనల మేరకు పోలీసులకు పిర్యాదుచేసినట్లు వివరించారు.ఈచోరి గ్రామంలో కలకలంరేపింది.ఏనోటవిన్న అమ్మవారి నగలుమాయంపైనే చర్చజరుగుతుంది.ఎవరు దీనికపాల్పడి వుంటారని విశ్లేసిస్తున్నారు.

## శ్రీ శ్రీ కళా వేదిక ద్వారా చురకశ్రీ ప్రతిభకు ప్రశంశ పత్రం



**కావలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ఐ.ఎస్.ఓ గుర్తింపు పొందిన సాహితీ, సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కవితల పోటీలలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తేనెలొలుకు తెలుగు భాష అనే అంశంపై 400 మంది కవులు వారి కలాలను అంశానికి తగినట్లుగా తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ, మాతృభాష మాధుర్యాన్ని ఉన్నతంగా అందించారు. అదేవిధంగా తెలుగు భాషను కాపాడుకుందామంటూచక్కని సూచనలతో కూడిన సాహిత్య విలువలతో మంచి అంశంలో పాల్గొన ఏడు గ్రూపుల నుండి వెలువడిన కవితలలో ఒక్కో గ్రూపుకు పది మంది చొప్పున టాప్ 10 ఎంపిక చేయడం కష్టతరమైనప్పటికీ విజేతలను ఎంపిక చేయడం జరిగింది. వీటిలో కావలికి చెందిన ప్రముఖ రచయిత కవి సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ చురకశ్రీ భావం, శిల్పం ,శైలి,పదాల అమరిక, అక్షర దోషాలు, నిబంధనలు అనుసరించి, ప్రమాణాలకు సరిపో యేట్లుగా వ్రాసిన కవితలను పరిశీలించి అర్హతలు మెండుగా కలిగిన కవితలను ఎంపిక జరిగింది ఇందులో గ్రూప్ ఐదులో టాప్ టెన్ లో నిలచిన సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ చురకశ్రీ విజేతకు శుభాభి నందనలు తెలియచేస్తూ మునుముందు కూడా ఇదే విధంగా మీ అమూల్యమైన కవనాలతో అలరిస్తారని ఆశిస్తూ అభినందనలతో శ్రీ శ్రీ కళావేదిక కార్య నిర్వాహక వర్గం అండ్ టీం ప్రశంశ పత్రం పంపడం జరిగింది. ఈ సందర్భంగా చాలామంది సాహితీ మిత్రులు చురకశ్రీ అభినందనలు తెలియచేసారు.

## కుండా అయ్యల రెడ్డి నేత్రదానం



**కావలి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కావలి పట్టణం గాయత్రి నగర్ కి చెందిన కుండా అయ్యల రెడ్డి (75 ) బుధవారం వారి స్వగృహం నందు మృతి చెందడం జరిగింది.వీరి నేత్రాలను ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి, మహేశ్వర రెడ్డి ప్రేరణ తో అభయం సేవా సంస్థ నిర్వాహకులు, రెడ్ క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి ప్రోత్సాహంతో కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. కుమార్తె బద్వేలి అజయలక్ష్మి అంగీకారంతో అయ్యల రెడ్డి కార్నియాలను ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అజయలక్ష్మికి అభయం నిర్వాహకులు ఇలింద్ర వంశీకృష్ణ నేత్రదానం ప్రశంసాపత్రం అందచేసారు. గత వారం రోజులలో 5 గురు నేత్రదానం చేయడం పట్ల కావలి రెడ్ క్రాస్ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. నేత్రదాన ఉద్యమానికి సహకరిస్తున్న వాసవి క్లబ్ వనిత లెజెండ్స్ దుగ్గిశెట్టి హేమలత, అనుమాలశెట్టి కామాక్షి లకు ధన్యవాదములు తెలియజేసారు.

## సహారా ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ వారి నేతృత్వంలో విద్యార్ధులకు విద్యాసామాగ్రి



**బుచ్చి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆద్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెంలోని ఇసుపాళెం పల్లిపాళెం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల నందు బాలబాలికలకు మధ్యహ్న బోజనానికి ప్లేట్లు ,నోటిబుక్స్, పెన్,పెన్సిల్స్, జామింట్రీ బాక్సులు, కలర్‌పెన్నలు,స్టాప్లర్ల రేసర్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు యస్దానిబాషా మాట్లాడుతు మేము మా సంస్థ ద్వారా గత కొద్ది సంవత్సరాలు నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లల కోసం దాతల సహకారంతో సేవా కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. పేద పిల్లలు చదువు కోవడానికి మంచి అవకాశాలుండి ప్రభుత్వం అన్ని విధాల పేదల పిల్లలకు అవకాశం కల్పిస్తుందని ఆయన తెలిపారు. పిల్లలకు యూనిఫాంలు, మద్యహ్న బోజనం,బుక్స్ అన్ని సౌకర్యాలు అందిస్తుందని ప్రతి ఒక్కరు పిల్లల్ని చదివించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి .నరసయ్య, ఉపాధ్యాయులు తులసి, రిటైడ్ ఉపాధ్యాయులు వెంకట్రావ్, సొసైటీ సభ్యులు పటాన్ రహమతుల్లా, విద్యార్ధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో రూ.3500లకే గుండె జబ్బుల స్క్రీనింగ్ పరీక్షలు




**నెల్లూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కేవలం రూ.3500లకే గుండె సంబంధిత జబ్బుల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ డైరక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలియ జేశారు. నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, కార్డియాలజిస్టులు డాక్టర్ షర్మిలి నౌషీన్, డాక్టర్ నాగభూషణ్‌తో కలిసి డాక్టర్ శ్రీరామ్ సతీష్ మీడియాతో మాట్లాడారు. దేశంలో గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తక్కువ ఫీజులతోనే అపోలో సంస్థ వైద్య సేవలు అందిస్తుంద`న్నారు. సామాజిక బాధ్యతగా భావించి అపోలో సంస్థ ఈ కార్యచరణతో ముందుకెళ్తుందని అన్నారు. ఈ నెల 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి నుండి తక్కువ ఫీజులకే గుండె సంబంధిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఇతర వైద్యులు తెలిపారు. 11వేల రూపాయల విలువైన 20 రకాల గుండె సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలను కేవలం రూ. 3500లకే అపోలో హాస్పిటల్ చేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 31వ తేదీ వరకు ఈ స్క్రీనింగ్ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, 40 ఏళ్ల దాటిన వ్యక్తులు, గుండె సంబంధిత రోగాల చరిత్ర ఉన్న కుటుంబాల్లోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షల్లో భాగంగా బీఎంఐ, సీబీసీ, బయోకెమికల్ ఫార్మాసిస్ట్ విభాగంలోని బ్లడ్ షుగర్, ఎస్ఆర్ క్రిటినియన్, ఎస్ఆర్ యూరిక్ యాసిడ్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. లిక్విడ్ ప్రొఫైల్ విభాగంలో టోటల్ కొలెస్ట్రాల్, హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, టోటల్ కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇవి కాకుండా ఈసీజీ, ఈసీహెచ్‌ఓ, ఛాతి ఎక్స్‌రే, టీఎంటీ పరీక్షలు కూడా చేస్తారన్నారు. ప్యాకేజీలో భాగంగా డాక్టర్ కన్సల్టేషన్, డైట్ కౌన్సిలింగ్ కూడా ఉంటుందన్నారు. అనంతరం అపోలో హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడుతూ అస్తవ్యస్త జీవన శైలి, వ్యాయామం, ఇతర దురలవాట్లు వల్ల ఎక్కువ శాతం మంది గుండె సంబంధిత రోగాల భారిన పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండె సమస్యలను ముందుగానే గుర్తిస్తే నయం చేయడం ఎంతో సులవని ఏర్కొన్నారు. మారిన నేటి ఆధునిక జీవన పరిస్థితుల్లో 40 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదికి ఒక్క సారి అయినా గుండె సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవడం ఉత్తమమని సూచించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ప్రవేశపెట్టిన ఈ నూతన స్క్రీనింగ్ పరీక్షల ప్యాకేజీని సద్వినియోగం చేసుకుని, గుండె వ్యాధులకు దూరంగా ఉండాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు, కార్డియాలజి విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రసన్నని పరామర్శించిన మాజీ మంత్రి కాకాణి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త** :ఈరోజు మాజీ మంత్రివర్యులు ,కోవూరు సమన్వయకర్త శ్రీ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ని నివాసంలో కలిసి పరామర్శించిన మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమకేసులు పెట్టి వేధించినంత మాత్రాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎవరు భయపడరని ఎంత అనగదొక్కాలని చూస్తే అంత ఎదురు తిరుగుతామని అన్నారు

## సొసైటీ డైరక్టర్‌గా 'గని'ప్రమాణ స్వీకారం



వింజమూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త వింజమూరు సొసైటీ డైరక్టర్‌గా గని శ్రీనివాస నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీనివాసులు నాయుడు తన నివాసం నుండి బంధుమిత్రులు శ్రేయోభిలాషులతో కలిసి బాణసంచా మోతల నడుమ పాత బస్టాండ్ సెంటర్ వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి మండలంలోని తెలుగుదేశం ముఖ్య నేతలు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సొసైటీ సీఈఓ మేకల రమణయ్య డైరక్టర్‌గా శ్రీనివాసులు నాయుడు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం శ్రీనివాసులు నాయుడును పలువురు శాలువాలు పూమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ డైరక్టర్ గని శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తమపై నమ్మకంతో రైతు సమస్యలను పరిష్కరించి వారికి చేదోడు వాదోడుగా ఉండేందుకు తమకు ఈ బాధ్యతను అప్పగించారని ఆయన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పదవికి వన్నె తెస్తామని అలాగే పార్టీ అభివృద్ధితో పాటు రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ పదవి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని అంగరంగ వైవంగా చేపట్టాలని చూసినప్పటికి ఎమ్మెల్యే సూచనల మేరకు డబ్బును వృధా చేయకుండా ప్రమాణ స్వీకారం చేసి రైతులకు సేవ చేసినప్పుడే తనకు అసలైన సంతృప్తి ఉంటుందని తెలపడంతో ఈ కార్యక్రమాన్ని ఆయన సూచన మేరకే జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గురజాల వెంకట రమణయ్య, సర్పంచ్ ఎన్.సుజనా, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వై.రామచంద్రరెడ్డి, గణపురం సుదర్శన్‌రెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, డాక్టర్ మాశిలామణి, ఎమ్మెస్ నాయుడు, కేఎస్ నాయుడు, వై.శ్రీనివాసులు నాయుడు, ఎన్‌బీకే ఫ్యాన్స్ షేక్ షరీఫ్, నూతలపాటి జయలక్ష్మీ, యాకశిరి భవాని, తిరుపతి ఆచారి, ఆరికొండ శ్రీనివాసులు, చాట్ల రమేష్ దేగ మధు యాదవ్, బండారు సత్యనారాయణ, కమతం శ్రీనివాసులు ఇమ్రాన్, పాములపాటి మాల్యాద్రి దొరస్వామి నాయుడు, చేబ్రోలు వసంతరావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## జనసేన కార్యకర్తలకు భీమా ఆందజేసిన ఎపి టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్



**రావూరు, సెప్టంబరు10ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో రెండు నెలల క్రింతం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఎపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ భీమా రూ. 5లక్షల ఆర్టీజీఎస్‌కు చెందిన పత్రాలను సంబందింత నామినీలకు అందజేశారు. రెండు నెలల క్రింతం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యురాలు గంధం సరస్వతమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బుధవారం రాపూరులోని మృతురాలి గృహానికి చేరుకోని ఆమె భర్త గంధం శంకరయ్య ని అజయ్ కుమార్ కలసి వారి భార్య మృతి పట్ల సంతాపం తెలిపి వారిని పరామర్శించారు. మృతురాలికి జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం వుండటంతో ఇందుకు సంబందించిన ప్రమాద భీమా రూ. 5 లక్షలకు సంబందించిన ఆర్టీజీఎస్ పత్రాలను, అలాగే పంగిలి గ్రామానికి చెందిన భట్టు రాముడు పంగిలి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి వారికి భీమా మొత్తానికి సంబందించిన ఆర్టీజీఎస్ పత్రాలను ఆందజేశారు. జనసేన రాపూరు మండల పార్టీ నాయకుడు జల్లెళ్ళ రాజేష్‌తో కలసి వారి కుటుంబ సభ్యులకు ఆందజేశారు. మృతుల కుటుంబాలకు సంబందించి భీమా విషయంలో ప్రత్యేక చోరవ తీసుకున్న రాపూరు మండల జనసేన పార్టీ నాయకులు జల్లెళ్ళ రాజేష్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట సంయుక్త కార్యదర్శి సుందర్ రామి రెడ్డి, జనరల్ సెక్రటరీ గునుకుల కిశోర్, జిల్లా నాయకులు నూనే మల్లిఖార్జున యాదవ్, ఈగి సురేష్, సింగంశెట్టి శ్రీరామ్, సుధా మాధవ్, జనసేన మండల పార్టీ నాయకురాలు కోండాపురం కస్తూరి, సర్వేపల్లి నివాస్,గుండు రాఘవయ్య తదితరులున్నారు.

## విశ్వసాయి డా. ఎస్.ఆర్.కె స్కూల్‌లో ఉచిత నేత్ర పరీక్షలు




**నెల్లూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త – విద్య** బుధవారం నగరంలోని స్థానిక విశ్వ సాయి డా. ఎస్. ఆర్. కె స్కూల్‌లో మాడరన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ ప్. చిన్మయి వారి బృందంతో కలిసి వి ద్యార్థులందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు అందజేశారు. విశ్వసాయి డైరెక్టర్స్ కృష్ణ మోహన్, ప్రిన్సిపాల్ రఘురామ్, పాఠశాల అధ్యాపకు లు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**మర్రిపాడు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** మండలంలోని పడమటి నాయుడుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి బదిలీపై వెళ్ళిన మాగంటి సుబ్బయ్యను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉన్నత వ్యక్తిత్వం, ఉత్తమ ఉపాధ్యాయుడిగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి వారు చేసిన సేవలను కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడులు రామయ్య, ఉపాధ్యాయులు దొంతు రత్నయ్య, నరసారెడ్డి, కర్రావుల రమణయ్య, విజయ భాస్కర్‌రెడ్డి, తోక వెంగయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్రకుమార్, వెంకటరెడ్డి యలగాల శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, అబ్దుల్ , మునాఫ్, వెంకటసుబ్బయ్య, మున్ని గ్రామస్తులు కొండారెడ్డి , విద్యార్థులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన వారికి ఘన సన్మానం



**సంగం సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** సంగం ఎంపిడిఒ కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్న ఏఓ శైలజా, డిప్యూటి ఎంపిడిఒ వరప్రసాదలు ఎంపిడిఒలుగా పదోన్నతి రావడంతో వారిని కార్యాలయం సిబ్బంది, టిడిపినాయకులు వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి,శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఏ మండలానికి వెల్లినా మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన కాంక్షించారు.ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి సరించండి

### - డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** నెల్లూరు డి.ఆర్.డి.ఎ సమావేశ హాలులో నెల్లూరు జిల్లాలోని 37 మండలాల ఎ.పి.యం లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు పరస్తున్న కార్యక్రమాల (ఐ.బి, యల్. హెచ్,బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, ఇతర అభివృద్ధి పథకాల)పై అవగాహన కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్ర మంలో ఐబి విభాగం మన డబ్బు మన లెక్కలు, విమెన్ పవర్ యాప్ , పుస్తక నిర్వహణ, బ్యాంకు లింకేజి విభాగము విమెన్ లేడ్, ఎంసీపీ హెచ్ యల్ పీ, లైవ్లీహుడ్ విభాగం విమెన్స్ ఇంట్రెప్రెన్యూరు, స్త్రీనిధి విభాగము చేయడమైనది. ఒ డీ లేని మండలాలకు కొత్త బయో మెట్రిక్ డివైస్ లను పంపిణీ, తదితర అంశ్యాలపై, చర్చించారు. ఈ కార్యక్రమంలో పి. వేంకటేశ్వర్లు డీపీఎంజి. మధుసూదన రావు డీపీఎంఐ. మురళి, డీపీఎం, బి. కామాక్షయ్య స్త్రీ నిధి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల సమస్యలని పరిష్కరించండి

### - జిల్లా అపస్మా అధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల సమస్యలకి పరిష్కరించాలని కోరుతూ జిల్లా అపస్మా అధ్వర్యంలో నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని ఆయన కార్యలయంలో కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా అపస్మా జిల్లా అధ్యక్షుడు నేల నూతల శ్రీధర్ మాట్లాడుతూ జిలా విద్యాశాఖా అధికారి బాలాజీరావు, ఇటీవల ప్రీ ప్రైమరీ ప్రభుత్వ గుర్తింపు గురించి ఒక ప్రొసీడింగ్స్‌ని విడుదల చెయటం జరిగిందని దాని విషయమై కలెక్టర్‌కి సాతగాబాధలను తెలియజేశామన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సమస్యలని పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర అపస్మ నాయకులు కూడా విద్యాశాఖ కమిషనర్ దృష్టికి ఈ సమస్యకి తిసుకువెళతామని చెప్పడం జరిగిందన్నారు. అనంతరం నెల్లూరు నగరంలో జరిగే అపస్మా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమానికి నాయకులు కలెక్టర్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అపస్మా ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, సెక్రటరీ రమేష్, వైస్ ప్రెసిడెంట్. హరినాథ్, కరస్పాండెంట్ శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు కేసుల మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

### 13న నేషనల్ లోక్ అదాలత్ : కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 10,ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను లు,తాగునీటి కుళాయిపన్నులు, ఖాళీ స్థలంపన్నులు,ట్రేడ్‌లైసెన్సు పన్నుల బకాయిదారులు, అనధికార నిర్మాణాలు లేదా అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణ యజమానులుపై క్రిమినల్ చర్యలకు న్యాయస్థానాల ద్వారా దాఖలు చేసిన కేసులను మాఫీ చేసుకునేందుకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓనందన్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాల యంలోని కమిషనర్ చాంబర్లో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను బకాయీదారులు 1500 మందిపై క్రిమినల్ కేసులు నమోదుకు ముందు ప్రీ లిటికేషన్ ద్వారా నోటీసులు జారీ చేసి ఉన్నారని, వారంతా నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ఈనెల 13వ తేదీన శనివారం నిర్వహించనున్న నేషనల్ లోక్ అ దాలత్ కు హాజరై బకాయల మొత్తాలను చెల్లించి కేసులను మాఫీ చేయించు కోవాలని కమిషనర్ సూ చించారు.జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రాంగ ణంలో ఆరోజు ఏర్పాటు చేసే ఎన్.ఎం.సి. పన్నుల వసూలు కేంద్రంలో చెల్లింపులు జరపవచ్చని, బకాయిలను సహా చెల్లించని వారిపై మూడు సంవత్సరముల వరకు కారాగార శిక్ష విధించేందుకు చట్టం అనుమతిస్తుందని కమిషనర్ తెలియజేశారు.గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాల మేరకు ప్రతి 3 నెలలకు నేషనల్ లోక్ అదాలత్ ను నిర్వహిస్తారని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో లోక్ అదాలత్ ను నిర్వహిస్తారని కమిషనర్ తెలిపారు. సాధారణ బకాయిదారులు కాకుండా భారీ మొత్తంలో మొండి బకాయిలు ఉన్నవారినుంచి పన్నులను వసూలు చేసేందుకు క్రమం తప్పకుండా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా చట్టపరమైన చర్యలను తీసుకుంటామని కమిషనర్ తెలియజేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వేలూరు రంగారావు పాల్గొన్నారు.

## మునుకూరు మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరికలు



**ముత్తుకూరు,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** మండలంలోని దొరువుల పాలెం పంచాయితీలో మిట్టపాల్యెం కు చెందిన 22 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సాధరంగా పార్టీలో ఆహ్వానించి నట్లు దొరువులపాలెం పంచాయితీ నాయకులు, పంటపాలెం సాగు నీటి సంఘం అధ్యక్షులు మునుకూరు మురళీధర్ రెడ్డి తెలిపారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో అందరూ ఆకర్షనీయులౌతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలకు మెచ్చి ప్రతి ఒక్కరు టిడిపిలోకి చేరుతున్నారని ఆయనఅన్నారు. ఈ పార్టీలోచేరిన వారిలో తీపలపూడి రామసుబ్బయ్య, దెయ్యాల మస్తానయ్య, దమ్మాయి శ్రీనివాసులు, తీపలపూడి శేషయ్య, కాయల మణి,వేలూరు శరణ్, ఈదూరు నరేంద్ర, మీదూరు వెంకటేష్, మీదూరు క్రిష్ణ, రౌతు రామసుబ్బమ్మ, మీదూరు పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం సభలో బుచ్చి నేతలు



**బుచ్చి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** అనంతపురంలో సూపర్‌సిక్స్ సక్సెస్‌సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తుండడంతో బుచ్చిరెడ్డిపాళెం నుండి టిడిపి నాయకులు తరలి వెళ్లారు. రాష్ట్ర చేనేత కార్పోరేషన్ డైరక్టర్ తాళ్ళ నరసింహ స్వామి,, చేనేత విభాగం నాయకు లు పాశం సురేష్, అగ్నికుల క్షత్రియడైరక్టర్ జ్ఞానేంద్ర తదితరులు అనంతపురం తరలి వెళ్లారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చెన్నయ్యకు విద్యాశాఖ అధికారులు ఘన సన్మానం



**బుచ్చి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని మండల ఎడ్యుకేషనల్ ఆఫీస్ నందు బుధవారం సాయింత్రం పెనుబల్లి ఉపాధ్యాయులు చీదరాల చెన్నయ్యకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా అభినందన సభ జరిగింది. 5 వ తేది ఎవన్ కన్వీన్ష హాల్ విజయవాడ లబ్బీపేటను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలానికి మంచి పేరు వచ్చింది. మండలంలోని ఉపాధ్యాయ యూనియన్లు కలిసికట్టుగా మండల విద్యాశాఖకు సహకారం అందించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ చీదరాల చెన్నయ్యను ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యాయ సంఘాలు, దళితనాయకులు సూదల రమణయ్య ఎం.ఇ.ఒలు దిలీప్‌కుమార్, రత్నం ,ఉపాధ్యాయులు,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**బుచ్చి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** కావలి పట్టణానికి చెందిన ఏపీ వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ జాన్ కుమార్తె, అల్లుడుల వివాహరిసెప్షన్ వేడుకలు బుచ్చిరెడ్డి పాలెం లోని కె.వి.ఆర్ గార్డెన్ మాలో అంగరంగ వైభవంగా ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగాపాల్గొని నూతన వధూవరులకను ఆశీర్వదించి శుభాకాంక్షలుతెలియ జేయ డం జరిగింది.పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది

## రైతులు పరిమితికి మించి యూరియా వాడొద్దు




**సైదాపురం, సెప్టెంబర్ 10, ప్రభాత వార్త** రైతులు పరిమితికి మించి యూరియా వాడొద్దని, అలా వాడితే పంటకు తీవ్ర నష్టం కలుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామంలో యూరియా వాడకంపై బుధవారం రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన మోతాదులో మాత్రమే రైతులు యూరియాను వినియోగించుకోవాలని తెలిపారు. అధిక యూరియా వాడకం వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆమె అన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వైసీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శిగా బాలకృష్ణ



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాత వార్త** : వైసీపీ లీగల్ సెల్ నెల్లూరు జిల్లా కార్యదర్శిగా గోమతం బాలకృష్ణను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయన లీగల్ సెల్‌సభ్యులతో కలిసి మాజీ మంత్రి , వైసీపీ పీఏసీ సభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డిని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల వైసీపీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాదులు బి. చెంచురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నరసింహారావు, మల్లికార్జున, చందు, చైతన్య, జనార్ధన్‌రెడ్డిలు ఉన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కోవూరులోని నందలగుంట లేఅవుట్‌లో నిర్మాణం చేపడుతున్న హ్యాండ్ బోర్ పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ పనులు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ జగదీష్, తదితరులు ఉన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



కోవూరు, సెప్టెంబరు 10, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఈ సందర్భంగా సమగ్ర శిక్ష పీవో వెంకటసుబ్బయ్య ఏజెన్సీలకు సూచించారు. కోవూరు మండలం లేగుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఏఎంవో సుధీర్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రతి విద్యార్థి ఈ భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం తినే వారి సంఖ్య పెరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

## 14న గ్రామ దేవత శ్రీ రాపూరమ్మ తల్లి నెల పోంగళ్ళు



రాపూరు,సెప్టంబరు10ప్రభాతవార్త రాపూరు గ్రామ దేవత శ్రీ రాపూరమ్మ తల్లి నెల పోంగళ్ళు సెప్టంబరు 14వ తేది నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుదవారం తెలిపారు. రాపూరమ్మ తల్లికి కోలువు గత నెల 15వ తారీఖు చేయడంతో కోలువు ముగిసి నెల రోజులు అయిన సందర్భంగా ఆలయం వద్ద ఈ నెల పోంగళ్ళు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అమ్మవారికి పోంగళ్ల పెట్టుకోని అమ్మ కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.